క్లుప్తంగా

పత్తిలో కాయకుళ్లు తెగులు నివారించుకోవాలి

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో పత్తిలో కాయకుళ్లు తెగులు వ్యాపించిందని, దీని నివారణకు చర్యలు తీసుకోవాలని పాలెం కేవీకే సమన్వయకర్త డా. ప్రభాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని ఖానాపూర్, మంగనూర్, బిజినేపల్లి, వసంతాపూర్, గుడ్లనర్వ గ్రామాల్లో కేవీకే ఆధ్వర్యంలో రైతుల పొలాలను సందర్శించి పత్తిలో కాయకుళ్లు తెగులును గుర్తించినట్లు పేర్కొన్నారు. దీని ఉధృతి పెరగముందే రైతులు అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని కోరారు.

గౌరవ వేతనం అందజేత

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటం, మొలచింతలపల్లి గ్రామాల్లోని పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న విద్యా వలంటీర్లకు గురువారం క్లాస్‌మెట్ క్లబ్ నియోజకవర్గ అధ్యక్షుడు పతంజలి శంకర్ గౌడ్ గౌరవ వేతనం అందించారు. అదేవిధంగా విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కాశిపురం మహేష్, ఉపాధ్యక్షుడు రత్నగిరి భీమయ్య, ప్రధానోపాధ్యాయులు బాలకిష్టయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా వెంకటయ్య



అమ్రాబాద్: ఇన్‌చార్జి ఎంపీడీఓగా వెంకటయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. పదర ఎంపీఈఓగా బాధ్యతలు నిర్వర్తిస్తూ అమ్రాబాద్ ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు.

యునాని వైద్య శిబిరం



పెద్దకొత్తపల్లి: పట్టణంలోని పీహెచ్‌సీలో గురువారం యునాని ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ యునాని డిస్పెన్సీలో నేషనల్ ఆయుష్ తరుపున జిరియాట్రిక్ వయోవృద్ధులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సురేష్, డాక్టర్ ఖలీల్‌ఖాన్ కరపత్రాలను విడుదల చేశారు. ఫార్మసిస్టు చెన్నయ్య, వెంకటేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కార్మికుల నిరసన

కల్వకుర్తిరూరల్: గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు ఆందోళన చేశారు. గురువారం మండలంలోని మార్చాల సమీపంలో ఉన్న సూర్యలత కాటన్ మిల్లు ఆవరణలో దాదాపు 300 మంది కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్మిక శాఖ అధికారులు స్పందించి శుక్రవారం ఎన్నికల కోసం సమావేశం ఏర్పాటు చేయాలని కార్మికులకు తెలపడంతో హర్షం వ్యక్తం చేశారు. నాయకుడు సూర్యప్రకాశ్ ఉన్నారు.

విరాళాల సేకరణ



పెంట్లవెల్లి: వరద బాధితుల కోసం మండలంలోని మల్లేశ్వరం పాఠశాల విద్యార్థినులు విరాళాలు సేకరించారు. గ్రామస్తులు తోచిన సాయం చేశారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు.

రజక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

కొల్లాపూర్: పట్టణంలో రజకసంఘం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గురువారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా తిప్పరాజుల సత్యనారాయణ(సన్నీ), గౌరవ అధ్యక్షుడిగా చిన్న మహంకాళీ, ప్రధాన కార్యదర్శిగా పరశురాం, కోశాధికారిగా శేఖర్, ఉపాధ్యక్షుడిగా జగదీష్‌లు ఎన్నికయ్యారు. నాయకులు తిప్పరాజుల నర్సింహా, శివశంకర్, సత్యనారాయణ, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

కొల్లాపూర్: రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావు క్యాంపు కార్యాలయం వద్ద దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఇంటర్ చదివిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. సూచించారు. ఈ నెల 10వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్: 9177050558, 9989761951 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రైతులను ఆదుకోవాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు కాళ్ల నిరంజన్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు కుంభం మల్లేష్‌గౌడ్, నిరంజన్ యాదవ్, శ్రీనివాసులు, సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కల్వకుర్తి బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానించిన మిత్ర ఫౌండేషన్ సభ్యులు



కల్వకుర్తిలో

గురువే నమః

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకొని గురువారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల, కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులను, ఉపాధ్యాయులను సన్మానించారు. కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల ఉన్నత పాఠశాలలో మిత్ర ఫౌండేషన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాగర్నూల్ బాలికల ఉన్నత పాఠశాలలో పూర్వ విశ్రాంత ఉపాధ్యాయురాలు సావిత్రమ్మ, బిజినేపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో విశ్రాంత ఉపాధ్యాయలకు సన్మానించారు. తెలకపల్లి ఎమ్మార్సీ భవనం వద్ద సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేశారు. సిద్ధార్థ మాడల్ పాఠశాలలో విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అచ్చంపేటలో ఎల్ఐసీ కార్యాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు ఏర్పాటు చేశారు. కొల్లాపూర్, లింగాల మండలాలతో పాటు పెద్దకొత్తపల్లి దేవల్‌తిరుమలాపూర్ ప్రాథమిక పాఠశాల, చారకొండ, జూపల్లి తుర్కలపల్లి, తిమ్మాయిపల్లి, సిర్సనగండ్ల, గోకారం, చంద్రాయన్‌పల్లి, ఉప్పునుంతల మండలంలోని పెనిమిళ్ల జెడ్పీహెచ్ఎస్‌లో, వెల్దండ, మన్ననూర్, తాడూరులో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వక్తలు మాట్లాడారు. రాధాకృష్ణన్‌ను సేవలను కొనియాడారు.



బిజినేపల్లి మండలం కారుకొండ ప్రాథమికోన్నత పాఠశాలలో..



తెలకపల్లి మండలం ఎమ్మార్సీ భవనం వద్ద



తాడూరులో..



లింగాలలోని ఉన్నత పాఠశాలలో ..



పెద్దకొత్తపల్లి తిరుమలాపూర్‌లో..



నాగర్‌కర్నూల్‌లో..



చారకొండలో..



మన్ననూర్‌లో..



వెల్దండ మండలం రాచూర్‌లో ..

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

వెల్దండ: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రావు పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు వెల్‌కమ్ పార్టీ ఏర్పాటు చేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో మాధవరెడ్డి, అధ్యాపకులు శివప్రసాద్, భరత్, వీణా, తదితరులు ఉన్నారు.

జ్వర పీడితులకు ప్రత్యేక వైద్య సేవలు

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): గ్రామాల్లో జ్వర పీడితులను గుర్తించి ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నామని పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్ అన్నారు. గురువారం మండలంలోని పోలెపల్లి, మహాదేవునిపేట, పోలెపల్లి తండాల్లో జ్వరపీడుతుల సర్వే నిర్వహించి వారి వివరాలు సేకరించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూడాలని, దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది రమేష్‌కుమార్, గంగ, తామర, అశోక్, శ్వేత, రామాలింగయ్య, మీన, మంగ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వనమహోత్సవం

మన్ననూర్: స్థానిక అంబేడ్కర్ కాలనీలో గురువారం వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుల ఆచారాలు, కట్టుబాట్లను అనుసరిస్తూ మహిళలు, యువతులు సుందరంగా అలంకరించిన గంపలలో వంటకాలను ఎత్తుకొని ఆయా వీధుల నుంచి బ్యాండు వాయిద్యాల నడుమ కుటుంబ సభ్యులతో ఊరేగింపుగా కలిసి కోదండ రామాలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం తూర్పు దిక్కు పురుగులగుట్ట వద్దకు చేరుకొని వన భోజనాలు చేశారు. మహిళలు గొబ్బెమ్మలు, కోలాటం యువకులు డీజే ఆట పాటలతో రోజంత ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో కాలనీ మహిళలు, పెద్దలు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం

తాడూరు: క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని మండల విద్యాశాఖ నోడల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అనిల్‌కుమార్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు సునీత, నిర్మల, అనిత, శేఖర్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తోటను పరిశీలించిన అధికారులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని చంద్రకల్‌లో వర్షానికి దెబ్బతిన్న కర్బూజ తోటను జిల్లా ఉద్యానవనశాఖ అధికారి జగన్, కొల్లాపూర్ ఉద్యానవన శాఖ అధికారి లక్ష్మణ్‌లు గురువారం పరిశీలించారు. రైతు బిజ్జుల శ్రీనివాసులు 3 ఎకరాలలో సాగు చేసిన కర్బూజ తోట దెబ్బతినట్లు గుర్తించారు. పంట నష్ట పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపుతామని వారు తెలిపారు. వారి వెంట సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.



తోటను పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖ అధికారి జగన్

జాతీయ ఆదివాసీ న్యాయ అభియాన్‌పై అవగాహన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని మొలచింతలపల్లి, అమరగిరి గ్రామాల్లో ఐటీడీఏ ఏపీఓ యాదమ్మ ప్రధానమంత్రి జన జాతీయ ఆదివాసీ న్యాయ అభియాన్‌పై చెంచులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకం ద్వారా చెంచు గూడెంలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతారన్నారు. ఆదిమజాతి గిరిజన తెగల జీవితాలను మెరుగు పరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రూ. 24వేల కోట్ల నిధులు సమకూరుస్తుందన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ చెంచు నియోజకవర్గ నాయకులు, శివ, మరియు చెంచులు పాల్గొన్నారు.



మొలచింతపల్లి చెంచుగూడెంలో అవగాహన కల్పిస్తున్న ఏపీఓ యదమ్మ

గురుకులాలను ఎత్తేసేందుకు కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలను ఎత్తేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని జిల్లా స్వేరోస్ కార్యదర్శి రెడ్డపాకుల శివశంకర్ ఆరోపించారు. గురువారం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏ కారణం లేకుండా పార్ట్ టైం ఉద్యోగులను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గెస్ట్ ఫ్యాకల్టీలను తొలగించడంపై విచారం వ్యక్తం చేశారు. ఒకేషనల్ కోర్స్, స్పోర్ట్స్ స్కూల్స్‌లను నిర్వీర్యం చేసి గురుకులాలను నాశనం చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. అనుబంధ సంఘాలతోని కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా స్వేరో ఉపాధ్యక్షుడు మోహన్ కుమార్, రమేష్, రాము, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందించాలి

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని చౌటచెరువు సమీపంలో ఉన్న ఎస్సీకాలనీ వాసుల ఇళ్లలోకి వర్షం నీరు చేరడంతో ఇబ్బందులు పడుతున్నారు. నిత్యావసర వస్తువులు నష్టపోయారు. ప్రతి వర్షాకాలంలో ఇళ్లలోకి నీరు చేరుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు. గురువారం సీపీఎం జిల్లా నాయకులు ఈశ్వర్ ఎస్సీకాలనీని సందర్శించి బాధితుల ఇళ్లను పరిశీలించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వ ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు పునరావాసం కల్పించి కావాల్సిన వస్తువులు అందించాలని కోరారు. కార్యక్రమంలో హనుమంతు, ఎల్లస్వామి, కుర్మయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ కాలనీలో ఇళ్ల మధ్యన ఉన్న నీటిని చూపిస్తున్న సీపీఎం నాయకులు

కాల్వకు మరమ్మతు చేయాలి



వెల్దండ: మండల కేంద్రంలో తెగిన డీ–82కాల్వను వెంటనే అధికారులు మరమ్మతు చేయాలని బీఆర్ఎస్ నాయకుడు చల్లా మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం తెగిన కేఎల్ఐ కాల్వను ఆయన పరిశీలించి మాట్లాడారు. అనంతరం నీట మునిగిన వరి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అశోక్, కొండల్‌యాదవ్, శ్రీను ముదిరాజ్, మల్లేష్, వరుణ్‌కుమార్, కిష్టయ్య తదితరులు ఉన్నారు.

మట్టి గణపతులను పూజిద్దాం



కల్వకుర్తి రూరల్: మట్టి గణపతులను ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని ప్రముఖ వైద్యుడు వీరమల్ల శరత్, బీజేపీ నాయకుడు రాంభూపాల్ రెడ్డిలు అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట 1000 మందికి మట్టి గణపతులను పంపిణీ చేశారు. రామచంద్రారెడ్డి, శేఖర్ రెడ్డి, రవి గౌడ్, నర్సింహా, బాబీదేవ్, శివ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



తెలకపల్లి మండలం గోలగుండంలో చిన్నారుల తల్లులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ



తాడూరు మండలం పాలుమూరులో..

తెలకపల్లి/ కల్వకుర్తి టౌన్/ తాడూరు/లింగాల: తెలకపల్లి మండలంలోని గోలగుండం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణమాసం కార్యక్రమం తెలకపల్లి సీడీపీఓ సంగీత హాజరయ్యారు. అనంతరం లక్నారం 2వ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. కల్వకుర్తి పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, తాడూరు మండలం పాలుమూరు అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ వనజ, లింగాల మండలంలోని రాయవరం, దారారం అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఆయా కేంద్రాల్లో పౌష్టికాహారానికి సంబంధించి కూరగాయలు, ఇతర నిత్యావసర సరకులను ప్రదర్శనగా ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. సీడీపీఓ దమయంతి, క్లస్టర్ సూపర్‌వైజర్ విజయమణెమ్మ, అంగన్‌వాడీ టీచర్ విద్యావతి, సూపర్‌వైజర్ విజయమణెమ్మలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

కొల్లాపూర్: విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని జడ్జి ఆర్‌వీఎస్ఎస్ మిధున్‌తేజ అన్నారు. గురువారం పట్టణంలోని కేజీబీవీ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. వ్యక్తిగత స్వేచ్ఛ ప్రతి ఒక్కరికి హక్కు అని పేర్కొన్నారు. లైగింక నేరాలు, పోక్సో చట్టం, అమలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నె శ్రీహరి, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మెంటర్లు పానుగంటి బాలస్వామి, మధుసూదన్‌రావు, కేజీబీవీ ప్రిన్సిపాల్ జ్యోతి, ఉపాధ్యాయులు ఉన్నారు.



మాట్లాడుతున్న జడ్జి ఆర్‌వీఎస్ఎస్ మిధున్‌తేజ

రక్తదానం మహాదానం



అచ్చంపేట రూరల్: రక్తదానం మహాదానమని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని జామె మసీద్ దగ్గర మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకుని మజీద్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హాజరై ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, మసీద్ కమిటీ అధ్యక్షుడు సిద్ధిఖ్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా సెక్రెటరీ రమేష్‌రెడ్డి, యూత్ రెడ్ క్రాస్ జిల్లా కన్వీనర్ కుమార్, రఫీ, ఆర్గనైజర్స్ దీదార్, హఫీజ్, మాసుం, సోహెల్, గౌస్, ఖాదర్ పాల్గొన్నారు.

కులవివక్షపై పోరాటాలు కొనసాగిస్తాం

కొల్లాపూర్: సమసమాజ నిర్మాణం కోసం కేవీపీఎస్ నిరంతర పోరాడుతుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న అన్నారు. గురువారం పట్టణంలోని కేఎల్ఐ అతిథిగృహంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో 77 ఏళ్ల స్వాతంత్ర్యం, రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. సెమినార్‌కు స్కైలాబ్‌బాబు, కాశన్నలు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరు పాటు పడాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు హన్మంతు, మండల ప్రధాన కార్యదర్శి బత్తిని రాజు, నాయకులు సాయి, కార్తీక్, సంజీవ్, రాజు తదితరులున్నారు.

పాన్‌డబ్బాలో నగదు, సామగ్రి చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: పాన్‌డబ్బాలో నగదు, సామగ్రి చోరీ అయిన ఘటన జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తాలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎప్పటిలాగే పాన్ డబ్బాకు తాళం వేసి జాఫర్ బుధవారం రాత్రి ఇంటికి వచ్చాడు. అదేరోజు అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తాళం విరగొట్టి అందులో ఉన్న రూ. 12 వేల నగదుతో పాటు సామగ్రిని చోరీ చేశారు. గురువారం ఉదయం గమనించి పోలీసులకు ఫిర్యాదు చేయగా క్లూస్‌టీం సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

మాజీ సర్పంచ్ మృతి



లాలమ్మ (ఫైల్)

పెద్దకొత్తపల్లి: ముష్టిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తోళ్ల లాలమ్మ అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, నాయకులు చంద్రయ్య, శ్రీనివాస్‌రెడ్డి, బాలస్వామి, చిన్నయ్య, కుర్మయ్య, ఖాజలు పరామర్శించారు. అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

సీపీఎం నాయకుల పర్యటన

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని వివిధ వార్డులలో గురువారం సీపీఎం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందికొండ గీత, కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్ శ్రీనివాసులు డ్రెయినేజీలను పరిశీలించారు.

గవర్నర్‌ను కలిసిన గోలి శ్రీనివాస్‌రెడ్డి



వెల్దండ: హైదరాబాద్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మండలంలోని నారాయణపూర్‌కు చెందిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలబొకే అందించి సన్మానించారు. రాష్ట్ర అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు.

సీఎం సహాయనిధికి విరాళం

నాగర్‌కర్నూల్: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా సర్వ కోల్పోయిన వరద బాధితుల కోసం గురువారం సామాజిక కార్యకర్త ఫిజిక్స్ అరుణ్ కుమార్ మిత్రుల సాయంతో తెలంగాణ, ఆంధ్ర సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.5వేల చొప్పున విరాళంగా అందజేశారు.

వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ హాస్టళ్లలో ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు. పట్టణంలో 3–4 హాస్టళ్లకు ఇన్‌చార్జ్ వార్డెన్‌లు కొనసాగుతున్నారన్నారు. హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు భాను, విజయ్, అభినయ్ పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రోగ్రాం అధికారికి వినతిపత్రం అందజేశారు. ఆశావర్కర్లకు రావాల్సిన లెప్రసీ డబ్బులు, పల్స్ పోలియో, ఎన్‌డీటీ వంటి కార్యక్రమాల్లో ఆశలకు రావాల్సిన పారితోషకాన్ని అందజేయాలని కోరారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని సీఐటియూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్స్ జిల్లా అధ్యక్షుడు కళావతి, వర్కింగ్ ప్రెసిడెంట్ రజిత, కార్యదర్శిశ్రీదేవి, రాణి, నారాయణమ్మ, మంగమ్మ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

నాగర్‌కర్నూల్‌రూరల్: ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని వైఆర్‌జీకేఆర్ స్వచ్ఛంద సంస్థ లింక్ వర్కర్ హేమలత పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ ఎయిడ్స్, క్షయ వ్యాధులపై అవగాహన కల్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుప్రజాత, లెక్చరర్ రామారావు, శ్రీనివాసులు, సైజావుద్దీన్‌బేగం, యాదయ్య, స్వర్ణలత, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

ఊర్కొండ: మండలంలోని వివిధ గ్రామాల్లో మృతి చెందిన బాధిత కుటుంబాలను గురువారం జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్ రెడ్డి పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన ఇప్పపాడు గ్రామానికి చెందిన దుబ్బ పెంటయ్య కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. బొమ్మరాజుపల్లి గ్రామానికి చెందిన మేకల శంకర్ మాతృమూర్తి లక్ష్మమ్మ దశదిన కర్మలో పాల్గొన్నారు. ముచర్ల పల్లి గ్రామానికి చెందిన కుడుముల వెంకటమ్మకు, రాచాలపల్లి గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ కార్మికుడు జెల్ల ముసలయ్య మృతదేహాలపై పూలమాల వేసి నివాళులర్పించారు. జకినాలపల్లి గ్రామపంచాయతీ పరిధికి ఆవాస ప్రాంతమైన అమ్మపల్లి తండావాసులు బీటీ రోడ్డు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు వెంకటయ్య గౌడ్, కాంగ్రెస్ నాయకులు రమేష్ నాయక్, తిరుపతి రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, పర్వత్ రెడ్డి, సత్యం రెడ్డి, గోపినాయక్, మనోహర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, వహిదోద్దీన్, ఆది నారాయణ, శ్రీనివాసులు, రవీందర్ గౌడ్, నాగరాజు, పాల్గొన్నారు.

